'అమ్మ'—ఎంత మధురమైనదీ మాట! విలువ కట్టలేని, అనుభూతుల నందించే ఆ పిలుపు ఎంత గొప్పది! 'అమ్మ' కావాలన్న కోరిక దహించి వేస్తుండగా నిస్సారంగా, నిస్తేజంగా జీవిస్తున్న మహిళలెంతమందో ఉన్నారు! 'అమ్మ' అని అని పించుకొనే మార్గం—కేవలం పిల్లలు లేనంత మాత్రాన మూసుకు పోతుందా? మనసుంటే మార్గమే ఉండదా?

# తల్లి మనసు

## ఐ. వి. యస్. అచ్యుతవల్లి

మంచి ఎండాకాలం. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది. వరండాకువున్న మేష్‌కి వట్టి వేళ్ళ తడకలుకట్టి గంటకు కడవలతో నీళ్ళు తెచ్చి తడుపుతున్నది పనిమనిషి. మా మేడకు చుట్టూ చాలా విశాలమయిన ఆవరణ వుంది. పెద్ద పెద్ద వేపచెట్లు, కాడ మల్లిచెట్లు, మామిడి చెట్లువుండి ఎంత ఎండాకాలమయినా చల్లని నీడతోవుంటుంది. నాలుగేళ్ళ క్రితందాకా ఆవరణ అంతా ఎండిన ఆకులతో పూలతో దుమ్ము రేగిపోయి వుండేది. ఇప్పుడు ఆవరణ చుట్టూ బార్బ్‌డ్ వైర్ కట్టించి బటాణీ పూల తీగెలు దట్టంగా అల్లుకునేట్లు చేసేడు మాలి. పిల్లలు ఆడుకుందుకు జారుడు బండ. అక్కడక్కడ మామిడి కొమ్మలకు చిన్న చిన్న ఉయ్యాలలు వున్నాయి. అక్కడక్కడ అల్లి బిల్లిగా అల్లుకున్న కాశీరత్నం, శంఖు పూల తీగెల మధ్య చిన్న చిన్న రేకులతో కట్టిన గదులున్నాయి. అంతటి ఎండ సమయంలోనూ ఆ గదుల్లో చిన్ని చిన్ని మాటలు అల్లరి చేసే పాటలు బుల్లి బుల్లి ఏడుపులు వినవస్తున్నాయి. పదిగంటలకు ఆయన వెళ్ళిపోతే తిరిగి రాత్రి పది పదకొండు గంటలదాక నిశ్శబ్దంగా వుండేది మా ఇల్లు. అల్లరి చేసేందుకు మా ఇంట్లో పిల్లలు లేరు. అయితే పిల్లలేనందుకు అది ఒక కొరతగా నేను నీరజ కన్పించేదాకా భావించలేదు. నాకు ఏమయినా లేసులు అల్లు కొనటం లేక ఏదయినా చదువుకొనుట రేడియో పాటలు వింటూ ఇంకా తోచకపోతే, మాట్నీ సినిమాలకు వెళ్ళటం ఇల్లా గడిచిపోయేవి రోజులు. పిల్లలంటే నాకు ఇష్టమే. కాని ఇరవయినాలుగంటలూ వాళ్ళతో వేగ లేనేమో అనే భయంతో పెళ్లి అయి పదిహేనేళ్ళకూ పిల్లలు కలగకపోయినా నేను ఎవర్ని దత్తు తీసుకునే ప్రయత్నం చేయలేదు. ఆయన ఏమయినా ఫీలయ్యేవారో లేదో నా ముందు మటుకు ఆ బాధ ఏదీ వ్యక్తం చేసేవారుకాదు. మా జీవితం పిల్లలు లేరనే బాధ తోచకుండా, వడివడిగా ఆనందగానే గడిచిపోయేది. నీరజ కన్పించే దాకా ఇప్పటికి నాలుగేళ్లు అయి వుంటుంది. ఇల్లానే బాగా ఎండగావుంది. పన్నెండు దాటింది. ఆరోజూ రేడియోలో పాటలు వింటూ వరండాలో పచార్లుచేస్తున్నాను. అనుకోకుండా రోడ్డు మీదకు చూసేను. ఉలిక్కి పడ్డాను. అంత ఎండలోనూ జనం

గుమి గూడారు. అందరూ కలగా పులగంగా ఏవేవో అంటున్నారు. ఆ మాటలు నా చెవులదాకా రాలేదు. అస్పష్టమయిన మర్మర ధ్వని మటుకే నా చెవులదాకా వస్తున్నది. మా రోడ్డు అంత ట్రాఫిక్ ఎక్కువగా గలదికాదు. అంచేత యాక్సిడెంటుకి అవకాశంలేదు. ఎవరో వడదెబ్బ కొట్టో, లేక మూర్ఛరోగో అయి వుంటారు. పెద్దమ్మ అప్పుడే రోడ్డు మీదకు వెళ్లి వార్త సేకరించి వడివడిగా లోపలికి పరుగెట్టుకుని వస్తోంది. నేను వద్దన్నా వూళ్లో విశేషాలు దాని నోటమ్మట నేను వినక తప్పదు. గబగబా మేడదిగి క్రింది హాలుకి వచ్చేను. "ఏమిటే ఆ జనం!" అని నేను ఇంకా అడగ లేదు. అడగక్కర్లేదు కూడా.

"ఎవర్తో ఆడదాయిని జనం బాదేస్తున్నా రమ్మగోరూ!" అంది. ఇంత ఎండలో మిట్ట మధ్యాహ్నం నలుగురూ పోగయితన్న గలిగేటంతటి అకృత్యం ఒక ఆడమనిషి ఏంచేసి వుంటుంది? మా వీధి అంతా సంపన్నులూ హోదాల్లోవున్న ఉద్యోగస్థులూ వుండే ఇళ్ళతో వుంది. అలగా జనం మచ్చుకైనా కనపడరు. మా ఇళ్ళల్లో పనిచేసే వాళ్లుకూడా ఎంతో నీటుగా శుభ్రంగావుంటారు. అంతా సంస్కారవంతులు! త్రాగుడయినా వ్యభిచారమయినా, ఏదో "గెట్ టు గెదర్" పేరుతో అతి హుందాతనంతో సాగుతుంది. కాని వీధిని పడికొట్టుకుని తిట్టుకునే స్థాయిలో జరగదు.

"మనిషి నాజూగ్గా శలాగ్గా వున్నదండి. పిచ్చిదో ఏటో! అన్ని దెబ్బలు తింటున్న గుడ్లప్పగించి చూట్టం తప్ప కంటెంట ఒక్క చుక్క బొట్టు అయినా రాల్తలేదండి." పెద్దమ్మ కథ మొదలెట్టింది. నాకు చూడాలనిపించింది. అక్కడ అంతా కాయగూరలు అమ్ముకునే వాళ్లు రిక్షవాళ్ళు వున్నారు. కాకుల్లో నెమలి పిట్టలా నేను వెళ్ళవచ్చా! సోషల్ స్టేటస్ అడ్డు వస్తోంది. కాని నాజూగ్గా చలాగ్గా వున్న ఆడదాన్ని చూడాలనే తహ తహ సోషల్ స్టేటస్‌ని బలవంతంగా క్రూరాతి క్రూరంగా వెనక్కి నెట్టివేసింది కాళ్లు రోడ్డు మీదకే నడిచాయి. మనసు కాళ్ళతో సహకరించక పోయినా. కాళ్ళు వాటంతటవే నడిచాయి. పెద్దమ్మ ఏమాట కామాటే చెప్పుకోవాలి నా హుందా తనాన్ని నిలబెట్టింది.

"అమ్మగారు వత్తున్నారు. దా రెట్టండి దా రెట్టండి." అంటూ "రాజు వెడలె" లా నాకు ముందు పరుగెట్టింది.

"అంత లా బాదెయ్యకండి పిచ్చిముండలా వుంది." అంటున్నారు ఒకరు.

"దొరికితే పిచ్చి, మూగ నటించటం ఈ ముండలకి మామూలే! పోలీసు స్టేషన్‌లో పడెయ్యాలి!" ఇంకొకరు అంటున్నారు.

"ఇంతకీ ఏం చేసిం దాయమ్మి!" అంటున్నారు ఒకరు.

"కిళ్లి కొట్టుకాడ ఏవో పళ్లు కొనుక్కుంటుంటే నాలుగేళ్ళ పిల్లని చంక నెత్తుకుని పరుగెత్తి పోయిందిట! ఆ పిల్ల ఏడుస్తోంటే అప్పుడు ఆ తల్లి చూసుకుని ఏడుస్తూ పరిగెత్తిందిట!"

"పిల్లకి చెవులకి బంగారం ఏమన్నవుందా!"

"తల్లికే లేవు. నల్ల పూసలూ బొందూ పిల్లకేం వుంటుంది బంగారం!"

ఈ మాటలతో నాలోని అభిజాత్యం పటాపంచ లయిపోయింది. ముక్కు ముఖం తెలియని పసిపిల్లని ఎత్తుకుపోయి అయినా లాలించాలనేంత తీవ్రవేదనకు గురి అయిన తల్లి మనసుని చూడాలనే ఆసక్తి చంపుకో లేక పోయేను. దొంగ. పిచ్చిది. పిల్లని ఎత్తుకు వెళ్లి ముష్టి వాళ్ళని చేస్తుంది. అని వ్యాఖ్యానాలు చేస్తున్న చలించకుండా, నడి రోడ్డుమీద పెనంలా కాలుతున్న రోడ్డుమీద కుప్ప కూలిపోయి చక్రాల్లాంటి కళ్ళతో జనంకేసి బెదురుగా చూస్తున్న స్త్రీ మూర్తిని చూసేను. నిజంగా ఎల్లా చూడగలగాను? చూసి ఎల్లా నిలబడ గలిగేను? నాలో వయస్సు పెరుగుతున్న కొద్దీ మానవత్వం, ప్రేమ, ఆర్ద్రత మొదలైన సున్నిత భావాలు ఆర్పుకుపోయేయికాబోల్సు! వర్షాకాలం ఎంతగా వర్షాలుకురిసి నేల నేలంతా

తడిసి పచ్చని పచ్చిక బయళ్ళని తయారు చేసినా శీతకాలం వచ్చేసరికి ఆ తడి అంతా క్రమ క్రమంగా పీల్చుకుపోయి ధూళీ దుమ్ము ఎల్లా సెగలుగా ఎండాకాలం పొగలుగా మారి పోతాయి. అల్లానే బాల్యంలోని స్నేహం అభిమానం వాత్సల్యం, ప్రేమ మున్నగు అతి తీయని అనుభూతులు, వయస్సులు పెరిగే కొద్దీ, అహంకారం, ఆడంబరం, కామం, మొదలయిన వికారాలవల్ల వాట్ల వాట్ల స్వచ్ఛత కోల్పోతాయి. నలుగురిలో దోషిగా హీనంగా వున్న ఆ మనిషిని నేను నా చిన్ననాటి స్నేహితురాలు నీరజగా గుర్తించాను. ఆడంబరం ముసుగు చీల్చుకుని ఆర్ద్రత ప్రకాశించింది.

"ఆగండి." అన్నాను. ఎవరో నీరజను రెక్క పుచ్చుకుని లాగబోయేరు. నేను ఆగమని గట్టిగా అనేసరికి నాకేసి వింతమృగాన్ని చూసినట్లు చూసి దాని రెక్కవదలేసారు. నేను దగ్గరగా వెళ్ళేను.

"నీరూ నీరూ!" రెండు భుజాలూ పుచ్చుకుని కుదిపాను. అతిలోక దృశ్యాలను చూస్తున్నట్లున్న చూపులు నన్ను గుర్తించలేదు. నెమ్మదిగా ప్రక్కనున్న ఇంకో ఆడమనిషి సాయంతో నీరజని లేవతీసి తీసుకువచ్చి నా కార్లో వెనక సీట్లో కూర్చో బెట్టాను. ఫామిలీ డాక్టర్‌గారి ఇంటికి తీసుకు వెళ్ళాను. నేను కలగ జేసుకున్నాక జనం ప్లేటు ఫిరాయించేరు. నానా మాటలూ అంటూ తిట్టి కొట్టుతున్న ఆ జనం నీరజకు ఒక ఉన్నతవర్గం మహిళ అండకు రాంగానే.

"అయినింటి ఆడ పిడ్డలావుంది" పాపం అని ఒకడు.

"పాపం ఆ యీడు పిల్ల వుండి సచ్చిపోనా దేమో!" అని ఇంకొకడు.

"ఎంత పచ్చగా వుందో! బంగారు తీగలా గుంది. నిండా ముప్ఫైయి ఏళ్లు వున్నాయో లేదో" అని ఇంకొకడు.

"ఎన్ని తిట్టినా పెదవి విప్పలేదు. ఎంతలం కొట్టినా చేయి విదల్చలేదు. అల్లా జాలిగా చూస్తూంది." అని వేరొకరు సానుభూతి చూపసాగారు. నీరజ దూషణభూషణ లకతీతమయిన మానసిక అవస్థలో వున్నదని నాకు తెలిసింది. డాక్టర్ లక్కీగా ఇంట్లోనే వున్నారు. పరీక్షించి.

"చాలా వీక్‌గావుంది. మెంటల్‌గా చాలా వర్రీ అవుతోంది. రెండు రోజులు ఇక్కడ వుణ్నియ్యి. ఆమెని తరుచు మాట్లాడించి డిస్టర్బ్ చేయకూడదు." అన్నారు. రెండు రోజులు నేను వెళ్లినా నీరజ ట్రౌజీగానే వుంటూ వచ్చింది నాలుగు రోజులు గడిచాక మా ఇంటికి తీసుకు వచ్చేను. సూరమ్మ మాఇంట్లో చిన్నప్పట్నించి వంట పనీ పై పనీ చూసుకునేది. బాగా పాతకాలం మనిషి. మా వారికి దూరపు బంధుత్వం వుంది. నీరజకు తలకు నీళ్లు పోసింది పెద్ద ఉసిరికాయల రసం మాడుకు మర్దించి మరీస్నానం చేయించింది. నా చీర జాకెట్టూ ఇచ్చాను. జాకెట్టు వదులయింది. నీరజ జుట్టు ఉంగరాలు తిరిగే పొట్టిజుట్టు. జుట్టుమొదట్లో రబ్బరు బాండ్ బిగించితేజుట్టంతా గుత్తిగా వుండి చాలా గుజ్జుగా ముద్దుగా వుంటుంది. ఫాన్‌గాలికి జుట్టు వీపంతా పరుచుకుంది. చేతులు వదులయిన బ్లవుజు లోంచి నిస్సత్తువుగా వేలాడుతున్నాయి. నీరజ వళ్ళంతా గీరుకుపోయింది. వాళ్లు రోడ్డుమీద ఈడ్చి రెక్కలు పుచ్చుకులాగీ నానా బాధలూ పెట్టటంతో జాకెట్టుకూడా విప్పుకోలేక బాధతో విలవిల లాడిపోయింది. పచ్చని పిక్కలమీద ఆకు పచ్చగా కములు మచ్చలుతేలాయి. ఆయన ఆఫీసుకు వెళ్ళినాక భోజనం ప్లేటు పట్టుకుని నీరజ నుంచిన గదిలోకి వెళ్ళాను. నాలుగురోజుల మానసిక విశ్రాంతి బలానికి మందులూ వేళ పట్టున భోజనంతో కొంచెం జీవకళ వచ్చినట్లు తోచింది నాకు. సూరమ్మను బయటకు వెళ్ళమన్నాను. ఈజీచైర్‌లో జారబడి పెద్ద కిటికీలోంచి పెరట్లోకి చూస్తూంది. భోజనం ప్లేటు టీపాయ్ మీదపెట్టి భుజంమీద చేయివేసి.

"నీరూ నీరూ" అన్నాను.

"ఊం." అంది. నా గొంతు రుద్ధమయింది. తన పేరు నీరజ అని గుర్తు వుందన్నమాట! తనని "నీరూ నీరూ" అని పిలుస్తారనికూడా తెలుసన్నమాట.

"నేను జ్ఞాపకం లేనా! మా ఆడపడచు పెళ్ళికి వచ్చినప్పుడు మీ యింటికి రాలా! రెండేళ్ళవలేదు ఇంకా!" అన్నాను.

ఆ నీలాల కళ్లు నన్ను పరిశీలనగా చూసేయి. దీర్ఘంగా ఆలోచనగా గాఢంగా చూసిన వెనుక ఆ కళ్ళల్లో వెలుగు, సంతోషం సంతృప్తి క్రమక్రమంగా చోటు చేసుకొన్నాయి.

"నువ్వు పార్వతివి కదూ!" అంది. స్నేహితులంతా "నీరూ పారూ" "నీరూ పారూ" అంటూ అల్లరి చేసేవారు మమ్మల్ని.

"అమ్మయ్య గుర్తుపట్టావు ఇన్నాళ్ళకి!" అన్నాను సంతోషంగా.

"ఇన్నాళ్ళూ! అవునూ. నేను యెలా వచ్చాను ఇక్కడికి?" అంది ఆలోచనగా. ముఖం కమిలిపోయింది. "సరే. ముందు భోజనం చెయ్యి. వసే, నీకిష్టమని మెంతి వంకాయకూర వండాను. చూడు యెలా కుదిరిందో!" అంటూ భోజనం ప్లేటు ముందుకు తోసి.

బయటకు వచ్చి డాక్టరుగారికి ఫోనుచేశాను. మనిషి శారీరకంగా బలహీనత ఆట్టేలేదు కనుక గతం గురించి గుర్తుకు తేవటంలో పెద్ద ప్రమాదం వుండదన్నారు డాక్టరుగారు. నీరజ గదిలోకి వచ్చేను. నింపాదిగా భోజనం చేస్తోంది. ఎదురుగ్గా కూర్చున్నాను. భోజనం ముగించాక వక్కపొడి ఇచ్చేను. సూరమ్మ ప్లేటు, మంచినీళ్ళగ్లాసూ పట్టుకుపోయింది బయటకు. "నీరూ ఏమిటిలా అయిపోయేవు? ఎక్కడ విశాఖపట్నం, ఎక్కడ హైద్రాబాదు! యెల్లా వచ్చేవు? వచ్చేప్పుడు నాకో టెలిగ్రాం ఇయ్యలేకపోయేవా? నేను ఇక్కడ బ్రతికే వున్నట్లు తెలియదా!" అన్నాను. నీరు కళ్లు నీటి కడవలయ్యాయి.

"పారూ నా కథ నేను చెప్పలేను. నీ పరిస్థితికూడా నాదానిలాగానే వున్నది" అంది సంకోచంగా.

"ఫరవాలేదు. అదేమిటో చెప్పు! నా కర్థం కాలేదు " అన్నాను.

"పారూ! నీకూ పిల్లలు లేరు. నాకూ లేరు. ఇద్దరి పరిస్థితి ఒకటి కాదా!"

"అయితే!" "అదే చెబుతున్నాను. నా కథ చెప్పితే నువ్వు బాధపడుతావు."

"ఎందుకు బాధ?"

"పిల్లలు లేకపోతే బంధువుల్లో యెంత హీనంగా చూడబడతారో నీకు అనుభవంలోకి రాలేదా?"

"నీరూ! నాకు పిల్లలు లేకపోయినా మా వాళ్ళెవరూ నన్ను హీనంగా చూస్తున్నట్లు తోచదు—కారణం మావారి డబ్బు అనుకుంటాను. పుట్టింట్లోనూ, అత్తింట్లోనూ కూడా మేము వెళ్ళితే అడుగులకు మడుగులు ఒత్తుతూ వుంటారు. నాకు అంచేత పిల్లలు లేకపోవటం ఒక న్యూనత కలిగించే విషయంలా తోచదు" అన్నాను.

నీరజ విచారంగా నవ్వింది.

"పారూ! నీవు అదృష్టవంతురాలివి. ప్రేమ పూరితమయిన భర్త ఒడిలో నీ లోపాన్ని నువ్వు మర్చిపోగలుగుతున్నావు. మీ వాళ్లు సంస్కారవంతులయి వుంటారు. స్త్రీ తల్లి కాలేకపోవటానికి అనేక కారణాలుంటాయి. శారీరకమయినవి. మానసికమయినవి. ఒకరి లోపాలని నలుగురిముందు బహిర్గతపరచి అవమానపరిచేవాళ్లు మనుష్యులు కాదు. పిశాచాలు అయివుంటారు. అలాంటి పిశాచాలు మావాళ్లు" అంది నీరూ కన్నీళ్ళతో.

"ఈ రోజుల్లోకూడా అలాంటి మూర్ఖులున్నారంటావా?" అన్నాను.

"పరమ మూర్ఖులు అనుకో. పైవాళ్ళ సంగతి వదిలేయి. మావారు కూడా రానురానూ మారిపోయేరు. పెళ్ళి అయిన కొత్తలో మా

ఇద్దరిలో అందమయిన అమ్మాయిలని కనాలని కుతూహలంగా వుండేది.

"నీరూ! మన పాప అచ్చు నీలా నే వుండాలి" అనేవారు ఆయన. సిరిసంపదలున్న ఇంటిలో అందమయిన ఆడపిల్లలుగా పుట్టటం కంటే అదృష్టం మరేమీ వుండదు. నాలో నేనే నా గొడ్రాలితనానికి బాధపడుతూంటే "నీరూ! మనకి పిల్లలు లేరని దిగులుపడకు. నాకు నువ్వూ నీకు నేనూ. ఈ లోకంలో ప్రతి చిన్నపిల్ల చిరునవ్వు మనకోసమే అని వూహించుకో!" అంటూ సముదాయించేవారు ఆయన ఓదార్పులో మనస్సు కొంత ఊరట చెందేది. క్రమక్రమంగా మా చుట్టు పక్కల ఇళ్ళల్లో ఏ ఫంక్షన్ వచ్చినా నాకు తెలియచేసే వారుకాదు. చిన్నపిల్లలని సరదాకు యెత్తుకున్నానంటే తర్వాత వాళ్లు దగ్గినా తుమ్మినా "దాని చేతికెందుకిచ్చావే! అది ఇంక బతికి బట్టకట్టి నప్పటిమాట!" అంటూ వెనకాతలా గొణుక్కునేవారు. ఒకొకప్పుడు నాకు తెలిసేలానే అంటుండేవారు. ఆయనతో చెప్పితే కొత్తలో ఓదార్చేవారు. "అనవసరంగా అన్ని మాటలూ పట్టించుకోకు. నీరూ! సంతోషంగా వుండు" అనేవారు. ఈమధ్య ఈమధ్య విసుక్కోవటం మొదలుపెట్టారు. వున్నదేదో అనుభవించక యెవరో యేదో అన్నారని యేడుస్తూ కూర్చోవటం అలవాటయిపోతోంది నీకు. వున్న మాటంటే ఏడుపెందుకు? వుట్టి గొడ్డుకి అరుపు లెక్కువట! అంటూ విసుక్కోవటం మొదలుపెట్టారు. ఇంట్లోనా నాతో ఎవ్వరూ కలుపుగోరుతనంగా వుండరు. లేవగానే నేను యెక్కడ కనపడ్తానో అని భయపడుతూ వుంటారు. వాళ్ళ పిల్లల్ని నా దగ్గరకు రానీయరు.

"ఎవళ్ళ పిల్లలంటే వాళ్ళకు అభిమానం వుండదా! ఎవళ్ళ జాగ్రత్తలో వాళ్లుంటారు. అన్నిటికీ యేదో చెప్పుకు వస్తూవుంటావు" అన్నారు ఒకరోజు.

"పోనీ మనం ఒక పిల్లను పెంచుకుందామండీ!" అన్నాను.

"నీకు పిల్లలు కలగరనే భయం వుంది. అంచేత పెంపకం పంపకం అంటున్నావు. నాకా భయం మటుకులేదు. అంచేత పెంపకం అనవసరం" అన్నారు.

"అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి!" అన్నాను.

"చాలా చదువుకున్నదానివి. విడమరచి చెప్పాలా!" అన్నారు.

"అంటే మీకు మీకు ఇంకొకరివల్ల సంతానం కలుగుతుందని నమ్మకం వుందా? "

"నా నమ్మకమే కాదు. డాక్టరు సలహా కూడా తీసుకొన్నాను. నీకేదో ద్రోహం జరిగిపోతున్నదనే బెంగ మనసులోకి రానీయకు. మొక్కలన్నీ పూయవు. పూసిన పూలన్నీ పరిమళభరితాలు కావు. నీకున్న ప్రత్యేకత నీకున్నది. అందం తెలివితేటలు డబ్బు, విద్య వున్నాయి. సంతానహీనత ఒక అపలక్షణం కాదు. కాని మన భవిష్యత్తుకి సంతానం అవసరం. ఎవర్నో అన్ని తెలుసున్నవాళ్ళని చివరి దశలో దత్తు తీసుకోవటం కంటే నాకున్న అవకాశాన్ని నేను వినియోగించుకోవటమే మంచిది అని తోస్తోంది నాకు."

"మీరేనా యీ మాట లంటూంటా!" అన్నాను.

"నేనుకాక ఇంకెవరికి అవసరముంటాయి? ఈ మాటలు అనేందుకు?"

"నన్నేం చెయ్యమన్నారు! అయితే!"

"ఏం చెయ్యక్కర్లేదు. ఏడుపులూ మొత్తుకోళ్ళూ పెట్టకుండా వుంటే చాల్ను."

"అంతకన్న మనం ఇద్దరం కలిసి చిన్న పాపాయిని పెంచుకొంటే బాగుండదాండీ! నాకుమటుకు పిల్లలని లాలించాలని వుండదా!"

"ఇద్దరం కలిసే పెంచుదాం. నాకు పుట్టిన పిల్లలు నీ పిల్లలు కారా! తల్లితండ్రి పరాయి వాళ్ళయిన పిల్లలని పెంచటంకంటే తండ్రి నీకు తెలుసున్నతను అయితే మరీ మంచిది

కాదా! నీ అభిరుచి ప్రకారమే పెంచుదువు కాని ”

"ఆవిడమటుకు తన పిల్లలని నన్ను చూడనిస్తుందా? అక్కలు, వదినలూ తోటికోడళ్ళూ ఆడపడుచులూ వాళ్ళకే పనికిరానిదాన్ని సవతికి పనికివస్తానా? తన పిల్లల్ని నన్ను కన్నెత్తి చూడనిస్తుందా? ఎందుకీ ఉబలాటం? మీవాళ్లు వద్దు నావాళ్ళూ వద్దు. తల్లితండ్రిలేని అనాథు లెందరో వున్నారు యీ దేశంలో. వాళ్ళలో ఒకళ్ళకయినా ఇంత నీడనిచ్చి జీవితంలో పైకి రావటానికి చేయూతనిస్తే పెద్దకాలంలో ఆ కృతజ్ఞతాభారంతోనయినా మనకి సాయితాగా వుంటారు. పదిహేనేళ్లు మీతో సంసారం చేసేను. ఇంక ఇప్పుడు నన్ను విడిచిపెట్టి, పిల్లలు లేరనే వంకన, పెళ్ళికొడుకయి కూర్చోవటం మీకు ధర్మం కాదు" అన్నాను.

"ఒకరికి ధర్మంగా న్యాయంగా తోచినది ఇంకొకరిపట్ల అధర్మంగా అన్యాయంగా వుండటం సహజం. దానికి ఎవర్ని నిందించుకునీ ప్రయోజనం వుండదు. నీకు కావల్సివస్తే నీవు విడిగా అనాథనే పెంచుతావో సనాథనే పెంచుతావో పెంచుకో. నేనుమటుకు నాకు తోచినది నేను చేస్తాను" అన్నారు.

"అయితే అతను మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా!" అన్నాను.

"ఏమో! నేను కొంత డబ్బు నగలూ తీసుకుని బయలుదేరేను. ఎల్లాగా సవతిని తీసుకురావటం ఖాయం అంటున్నారు. ఇంక ఆ ఇంట్లో నాకేమి విలువ వుంటుంది! ఇక్కడ ఎవర్నైనా కలుసుకుని అనాథపిల్లల శరణాలయంలో ఆయాగా జేరుదామని బయలుదేరాను."

"మీ వాళ్ళింటికి వెళ్ళలేక పోయేవా!"

"భర్త చూడకపోతే అత్తింట, తల్లి లేకపోతే పుట్టింట ఉండకూడదని మా అమ్మగారు అంటూండేవారు. ఇంక ఆ రెండు ఇళ్ళూ నాకు దూరమయినట్లే కదా! అంచేతే ఏదయినా




ఉద్యోగం వెతుక్కోవాలనే వచ్చేను - మరి నా సూటుకేస్ - బట్టలూ అవీ ఎల్లా ఎప్పుడు పోయాయో, నాకు జ్ఞాపకం రావటం లేదు. నిరాధారగా నీకు దొరికేను.''

''ఏమీ ఆలోచించకు నీరూ! కొన్ని రోజులు మా ఇంట్లో వుండు. నిమ్మదిమీద ఏదయినా కంపెనీలో ఉద్యోగం చూసుకుందువుగాని. ఎప్పటికయినా మీవారు నీ మంచితనం గ్రహించక పోరు.''

''ఆయన నా మంచితనం, ప్రేమా గ్రహించాలనే తపన ఆయన మరో పెళ్ళి తలంపు తెచ్చిన రోజునే కర్పూరంలా హరించిపోయింది. పారూ! నా వల్ల తన జీవితం సంసార జీవితం పాడయినట్లు మాట్లాడుతున్నప్పుడు ఎంత తాళి కట్టిన భర్త అయినా ఆడది గౌరవించలేదు. కష్టమయిన నష్టమయిన, ఇద్దరూ ఆ లాభనష్టాలను సమంగా పంచుకోగలిగితేనే పరస్పర గౌరవప్రేమాదరాలు నిలుస్తాయి. కేవలం సంతానం కలగలేదన్న నెపంతోఇంకో స్త్రీకి నా జీవితాన్ని పంచమంటున్నారు కదా! అదే ఆయనకే సంసారము చేయటానికి పనికిరాని అవిటితనము వుంటే తను ఇంకో పురుషుడితో జీవితాన్ని పంచుకుంటారా? మీ స్థానం మీకు వుంటుంది. కేవలం పిల్లలకోసమే ఇంకో భర్త అని నేను అంటే ఈ సమాజంకాని ఈ భర్త కాని గౌరవిస్తారా! అసలు మనలోనే ఎంత వద్దని వదిలించుకుందామన్నా వదుల్చుకోలేని పాత వాసనలు బంకమట్టిలా అతుక్కుపోయేయి. స్వతహాగా ఏ ఆడదయినా తన జీవితంకన్న ముఖ్యంగా ఎంచుకొనేది శీలం. అది మన నరనరాల్లా ప్రాకిపోయింది. అందుకనే ఈనాటికీ మగవాళ్ళూ ఏదో వంకన మోజు తీరిన స్త్రీలని వదిలించుకోవాలని చూస్తున్నారు'' అంది నీరజ.

నీరజ-శ్యామదాసు ఇద్దరూ అందమయిన వాళ్ళు. విద్యావంతులు. సంస్కారవంతులు. ధనవంతులు. ఇంత చిన్న కారణంగా విడిపోవటమా! సంతానం భార్యాభర్తలని ఒకే గూటికి అంటిపెట్టుకునేటంతటి బలమయిన బంధమా. నాకుకూడా ఎక్కడో అంతరాంతరాల్లో సన్నని బాధ మొదలయింది. జీవితం పొడుగునా అడుగు అడుగుకూ భయపడిపోయి నిలబెట్టుకోవాల్సినదా వివాహ బంధం! చలిజ్వరం వెన్నెముకగుండా ప్రాకినట్లు వణుకువచ్చింది.

వారం పది రోజులకు నీరజ బాగా లేచి కులాసగా తిరగసాగింది.

"నీరజకు ఏదన్నా ఉద్యోగం కావాలిట'' అన్నాను ఆయనతో. నీరజ సంగతులు కొంచెం కొంచెం ఆయనకు తెలిసాయి.

"ఉద్యోగమా! ఎందుకు!'' అన్నారు.

"దానికి మనశ్శాంతి కావాలి. ఏదో ఒక వ్యాపకం లేకపోతే అది బ్రతకలేని పరిస్థితిలో వుంది'' అన్నాను.

"పూర్తిగా విడిపోయినట్లేనా!'' అన్నారు.

''విడిపోయినా విడిపోక పోయినా అది ఇప్పట్లో అతనితో సంబంధబాంధవ్యం పెట్టుకోదల్చుకోలేదు."

''అయితే ఒక పని చెయ్యవచ్చును. ఆమెకీ పసిపిల్లల సరదా అనుకుంటానుకనూ!''

"సరదా ఏమిటి! ప్రాణం పెట్టుంది. అందుకనే అనాధ శరణాలయాలవంటివి దేనిలోనైన చిన్న ఆయాగా జేరుతానంటోంది. అసలు ఒక పిల్లను పెంచుకుందామనుకుందిట. దాని భర్త అందుకు ఆటంకం చెప్పేసరికి వూరుకుండిపోయిందిట."

పిల్లల్ని పెంచుకోవటం అంటే మాటలు కాదు. వాళ్ళని అతి గారాబంచేస్తే విద్యాబుద్ధులు అంటవు. తమ మాతృప్రేమని అంతా పసివాళ్ళమీద ఒక్కుమ్మడిగా ఒలకబోస్తే ఆ పసివాళ్ళు ఉక్కిరిబిక్కిరి అయిపోతారు. తర్వాత అదంతా పెద్ద బాధ్యతతో కూడుకున్న పని. బంధువుల్లో దత్తు తీసుకుంటే భర్త వెంపు వాళ్ళయితే భార్యకు శ్రద్ధ వుండదు. భార్య వెంపు వాళ్ళయితే భర్తకు శ్రద్ధ వుండదు. ఇంక అనాధలయితే వాళ్ల పెరిగి పెళ్ళిళ్లు అవీ చేయబోయేసరికి అది వక ప్రాబ్లం అవుతుంది. పెంచుకొన్నది మగపిల్లవాడు అయితే వాడు పెద్ద చదువులు చదివి వూహించలేనంత హోదా సంపాదించితే కాని మన కుటుంబాలలో పిల్లలని ఇవ్వటానికి ముందుకురారు. ఆడపిల్లయితే

పిల్లకి పెళ్ళిచేయటమే గగనం అవుతుంది."

"బాగుంది. మీ వివరణ అంతా నాకెందుకు? నేనేమన్నా పెంచుకుందామంటున్నానా ఏం!"

నవ్వారు తను. "పిచ్చిదానా నీకు మటుకు పిల్లలులేని మన ఇల్లు బోసిపోయినట్లు తోచదా! లోటు అందరికీ వకటే! అందుకే నీకూ,నీరజకూ కూడా, బాధ్యతలు లేకుండా పసిపిల్లల సరదా తీరే ఉపాయం ఒకటి చెబుతున్నాను. ఆలోచించండి మన పేటలో చాలామంది మధ్యతరగతి ఉద్యోగస్థులున్నారు. వాళ్లు ఎక్కువ డబ్బుపోసి ఎవరికి వారు పిల్లల్ని చూసుకుందుకు ఆయాలని పెట్టుకునే స్తోమతు లేనివాళ్లు. పిల్లలని చూసుకొనే వాళ్లుంటే ఆ తల్లులుకూడా ఏవో చిన్నచిన్న పనులు చూసుకొని కుటుంబాదాయం పెంచుకునేదానికి కృషి చేసుకొంటారు. మీకు పిల్లల సరదా తీరుతుంది. ఆ తల్లులకి కాస్త వెసులుబాటు చిక్కుతుంది. అందుచేత మన తోటలో మీరిద్దరూ కలిసి చిల్డ్రెన్ కేర్ హోం ఒకటి ఏర్పాటు చేయండి. ఉదయం తొమ్మిది నించి సాయంకాలం ఆరుగంటలదాకా, మీరు పిల్లల్ని ఆడించుతూ కథలు కబుర్లు చెబుతూ పాలూ పళ్లూ తినిపించుతూ సరదాగా గడుపుకోవచ్చును. పిల్లలు పాడుచేస్తే శుభ్రపరచటానికి ఒకరిద్దరు పనివాళ్ళని మనమే పెట్టవచ్చును. మీ సరదా తీరుతుంది. అది ఒకళ్ళకి పుపకారమూ అవుతుంది" అన్నారు. నీరజ ఎంతో సంబరపడింది. నిజంగా మా పారూ అదృష్టవంతురాలు. అన్నగారూ! దానిలోని తల్లి మనస్సుని గ్రహించకల్గారు. మీకు మేము ఋణపడి వుంటాం!" అంది.

"నిజమేనండీ!" అన్నాను నేను.

"దానికి మీరు నాకు కాదు. శ్యామదాసు గారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. శ్యామదాసు గారు ఒక పిల్లని పెంచుకుందుకు ముందుకు వస్తే మీరు కేవలం ఆ పిల్లయొక్క భవిష్యత్తుకే మీ జీవితం ధారపోసేవారు. మీరు ఇల్లా కనబడకపోతే, ఈ విధమయిన ఆవేదన మా పారుకి కూడా వుండవచ్చునన్న ఆలోచన నాకూ తోచేది కాదు. ఒక మంచిపనికి ఆలోచన వచ్చింది కనుక శ్యామదాసుగారికి తల్లులందరూ ఋణపడి వుంటారు. ఇంకో విశేషం చూసారా! ఒక పిల్లని పెంచుకుంటే కొన్నాళ్ళకు అది పెద్దదయిపోతుంది. ఇల్లాంటి సంస్థని నడిపే మంటె మనం ఓపిక వున్నన్ని రోజులూ, పువ్వుల్లాంటి పసిపిల్లలతోనే కాలం గడప వచ్చును. నిత్యం ఆ పసివాళ్ళు, పసిడి పలుకులతో మనం సంతాన హీనుల మన్న ఆలోచనే రాకుండా కాలం గడపవచ్చును."

"ధన్యోస్మి స్వామీ. ధన్యోస్మి!" అన్నాను నాటకీయంగా. నీరజ నేనూ, చెరిసగం డబ్బు వేసి తోటలో గదులు కట్టించాము. మాలీ, శేషమ్మ, సూరమ్మ, అప్పుడప్పుడు పైడమ్మ కూడా మాకు సాయంవస్తూ వుంటారు. పది మంది పిల్లలతో మొదలయిన మా సంస్థలో ఇప్పుడు యాభయ్ అరవయ్ మంది పిల్లల దాకా పెరిగిపోయేరు. మా స్నేహితురాలు దూరపు చుట్టం అయిన ఒక లేడీ డాక్టరును అప్పుడప్పుడు వచ్చి పిల్లల్ని చూసిపొమ్మని చెప్పేము.

ఆయన అప్పుడప్పుడు అంటూ వుంటారు. నిజంగా నీరజ చాలా హాయిగా వుంటోంది. "చూసావా! నీరజ ఎంత సంతోషంగా వుంటోందో! తన తల్లి ప్రేమను ఎంతమంది పిల్లలకు పంచుతోందో!" అని.

"అవునవును. ఆడది భర్తప్రేమను పంచలేదు కాని తల్లి ప్రేమను ఎంతమంది పిల్లలకయినా పంచకలదు. ఇల్లాంటి ఆడదానికి ప్రేమ స్వరూపిణి. సహనశీల అని బిరుదులు తగిలిస్తారు కదా!" అన్నాను.

"భర్త ప్రేమను పంచితే సతీసుమతి, శర్మిష్ఠా సతి అవుతారుకదుటోయ్!" అంటారు తను నన్ను వూరించుతూ.

"ఆ బిరుదులు ఈ తరం ఆడవాళ్లు కోరుకోవటం లేదని మా నీరజ నిరూపించింది కద" అన్నాను అతిసున్నితమయిన సమస్యకు అతి ప్రయోజనకారి అయిన పరిష్కారము చూపెట్టినవార్ని తలుచుకుని గర్వించకుండా వుండలేను. మరి! స్త్రీలో భార్యనే కాకుండా తల్లినికూడా చూడకలిగే పురుషుణ్ని స్త్రీ ఆరాధించకుండా వుండగలదా? □